కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలపై వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీజేఎఫ్ చైర్మన్ నారగోని

కాచిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో బీసీలకు సబ్‌ప్లాన్ లేకుండా వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ (ఎన్పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. శుక్రవారం వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ చూస్తుంటే ప్రధాని మోదీ ఆయన పదవిని కాపాడుకునేలా ఉందన్నారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా బీసీ కులాల అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడం, బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమని అన్నారు. పారిశ్రామిక రంగంలో కులవృత్తులు దెబ్బతింటున్న కులాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

◆ జాతీయ బీసీ కార్పొరేషన్ నియమ నిబంధనలు సడలించి కులవృత్తులు, చేతి వృత్తులు వారికి స్వయం ఉపాధి పథకాలు, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా బీసీలకు మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా బీసీలందరూ సంఘటితమై రాజ్యాధికారం సాధించుకోవడానికి సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీసీ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజులు నేత, నర్సయ్య, జగదీష్‌యాదవ్, డా. టీవీ రామనర్సయ్య, బోయ గోపి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం



రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో మోసం చేశాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సాగర్ విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాగర్ మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నట్లు కేంద్ర బడ్జెట్ అంకెలు తెలియజేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ, వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలని రైతులు ఆందోళన చేస్తుంటే బడ్జెట్‌లో ఊసే లేకపోవడం విచారకరమన్నారు. స్వామినాథన్ సిఫారసుల అమలును పూర్తిగా విస్మరిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఎంఎస్‌పి లేని పంట ఉత్పత్తుల ధరలు తగ్గించిన పక్షంలో మార్కెట్‌లో జోక్యం చేసుకున్న స్కీమ్‌లను పూర్తిగా ఎత్తి వేశారన్నారు.

◆ పది సంవత్సరాలుగా రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. వీటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పరిశోధనలో నూతన వరివంగడాల అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యం కల్పించడం సరైంది కాదన్నారు. ఫసల్ బీమాకు రూ.400 కోట్లు తగ్గించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. పీఎం కిసాన్, గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు పెంచలేదని విమర్శించారు. రైతు సంఘం సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరబండి ప్రసాదరావు, గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, ఆర్.శ్రీరామ్‌నాయక్, డీవీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, వివిధ సంఘాల నాయకులు జక్కల వెంకటయ్య, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కేంద్రానికి ఎందుకీ వివక్ష..!

కాచిగూడ: కేంద్ర బడ్జెట్‌లో ఇతర దేశాలకు సాయంలో భాగంగా కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువగా బీసీలకు బడ్జెట్‌ను కేటాయించి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వివక్షతను చూపుతోలందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. భూటాన్ కు రూ.2068 కోట్లు, నేపాల్ కు రూ.700 కోట్లు, మాల్దీవులకు రూ. 400 కోట్లు, మారిషస్‌కు రూ.370కోట్లు, శ్రీలంకకు రూ. 245 కోట్లు, మొత్తం రూ.3,783 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. దేశంలో ఉన్న 70 కోట్ల మంది ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది కేవలంరూ.3300 కోట్లు మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.పరాయి దేశ ప్రజల కన్నా తక్కువై పోయారా ఈ దేశ బీసీలు అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బీసీలను విస్మరిస్తున్న బీజేపీకి గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మట్లాడుతున్న వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గీతా కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన సంఘం నాయకులను స్మరిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర బడ్జెట్‌లో గీతా కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలనే డిమాండ్‌తో ఆగస్టు 2న బోలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వరకు గీతన్నల చైతన్య యాత్ర వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గీతాకార్మికులు అందరూ తరలిరావాలని కోరారు. ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గీతాకార్మికుల సంక్షేమానికి రూ.68 కోట్లు, నీరాకు రూ.25కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గీతాకార్మికులకు సేఫ్టీ మోకులు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. గీతా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, గౌనీ వెంకన్న, బాలగోని జయరాములు, గాలి అంజయ్య, బుడిద గోపి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల వీరమరణం వెలకట్టలేనిది



ట్యాంక్‌బండ్‌పై ఉన్న యుద్ధట్యాంకర్ వద్ద జై జవాన్ అంటూ నినాదాలు చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

కాచిగూడ: బద్రుక కామర్స్ కాలేజ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్రీకిషన్ భద్రుక, డైరెక్టర్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జానకీరామ్, డాక్టర్ పి.వెంకటయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కె.మహేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఈవీసీఎం శాస్త్రి, డాక్టర్ కె.మమత, ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని కార్గిల్ అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదుల ముసుగులో కాశ్మీర్‌ను కబళించేందుకు పాక్ చేసిన కుటిల ప్రయత్నాలను భారత్ తిప్పికొట్టి నేటికి 25 ఏళ్లు అవుతుందన్నారు. సుమారు 73 రోజుల పాటు సాగిన యుద్ధంలో అధికారిక లెక్కల ప్రకారం 527 మంది భారత సైనికులు ప్రాణాలు అర్పించారని వారు పేర్కొన్నారు. పాక్ ఆర్మీకి కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. శత్రు సైన్యాన్ని తరిమికొట్టే ప్రయత్నంలో జవాన్లు ఎందరో నేలకొరిగారని అన్నారు. అమరులైన జవాన్లను ఓసారి స్మరించుకోవడం మనందరి బాధ్యత అని వారు గుర్తు చేశారు.

రెడ్డి మహిళా కళాశాలలో...

తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్గిల్ వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు, వారి కుటుంబాలకు దేశ ప్రజలు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని అన్నారు. కార్గిల్ యుద్ధ విజయం సైనికుల పరాక్రమానికి, దేశ గౌరవానికి చిహ్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోమీల సీతారాం, రిషిక, అతిథి, టి.రాజశేఖర్ రెడ్డి, ఎం.శ్యామ్‌రాజ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల పోరాట పటిమను స్మరిస్తూ..

కవాడిగూడ: భారత రక్షణ రంగాన్ని ప్రైవేటు పరం చేసే 'అగ్నిపథ్'పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రి, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న యుద్ధట్యాంక్ వద్ద భారత సైనికుల పోరాట పటిమను స్మరిస్తూ నినాదాలు చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలు సైనికుల త్యాగనిరతిని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. ఆర్మీలో పెన్షన్ల బారం అంటూనే బీజేపీ పార్టీ అగ్నిపథ్ పథకాన్ని తీసుకురావడం సరికాదు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సత్యప్రసాద్, శ్రీమాన్, బాలకృష్ణ, షేక్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పుర రెడ్డి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ



బద్రుక కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

గ్రేటర్‌కు రూ.10వేల కోట్లు కేటాయింపు హర్షణీయం

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లను కేటాయించడం హర్షణీయమని టీపీసీసీ ప్రచార కార్యదర్శి అభిషేక్‌రెడ్డి అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు రూ.10వేల కోట్లు ఎంతో అవసమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

అశోక్‌నగర్ చౌరస్తాలో కేండిల్ ర్యాలీ

చిక్కడపల్లి: కార్గిల్ విజయ దివాస్‌ను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తాలో కేండిల్ ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమర జవానుల చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జాక్ నాయకులు నర్సింహ, మిత్ర, సుధీర్, రవి రాథోడ్, నాగరాజు రాథోడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల రహదారుల్లో ప్యాచ్‌వర్క్ పనులు

ముషీరాబాద్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని భారత్ సేవా సమాజ్ ప్రాంతంలో డ్రైనేజీ పైపులైన్ పనులు చేపట్టి మట్టితో కప్పేశారు. పండగ రోజు భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున ఆయన ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు మ్యూట్ కోర్టులు

ఉస్మానియా యూనివర్సిటీ లా ప్రొఫెసర్ లాడిన్



అంబేద్కర్ న్యాయ కళాశాలలో జరిగిన మ్యూట్ కోర్టులో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: న్యాయ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు 'మ్యూట్ కోర్టులు'ఎంతగానో దోహదం చేస్తాయని ఓయూ లా ప్రొఫెసర్ లాడిన్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ లా కళాశాలలో న్యాయ విద్యార్థులకు మ్యూట్ కోర్టుల పోటీలు నిర్వహించారు. ఎనిమిది మ్యూట్ కోర్టులు ఏర్పాటు చేసి మొత్తం 16 గ్రూప్‌లుగా విభజించారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ. లాడిన్ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు న్యాయ వ్యవస్థ నిర్మాణానికి దోహదపడతాయని అన్నారు. న్యాయ విద్యార్థులకు థియరీతో పాటు క్షేత్రస్థాయిలో ఎలా నైపుణ్యాన్ని పెంచుకోవాలో ఈ కోర్టుల ద్వారా అవగాహన పెంచుకోవాలని సూచించారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొ.కేశవరావు మాట్లాడుతూ.. కోర్టుల్లో న్యాయవాదులు పలు సమస్యలపై ఎలా వాదిస్తున్నారో అదే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడానికి ఈ మ్యూట్ కోర్టులు దోహదం చేస్తాయన్నారు. న్యాయ వ్యవస్థకు సంబంధించిన అనేక విషయాలను క్షుణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. విజయలక్ష్మి, అంబేద్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌ను రెండు గాడిద గుడ్లతో పోల్చవచ్చు



మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా. గౌతంరావు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను గాడిద గుడ్డుతో పోల్చిన కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రెండు గాడిద గుడ్లతో పోల్చవచ్చని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క చదివిన బడ్జెట్ అంతా ఒక రాజకీయ ప్రసంగంలా ఉందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి వెన్నుముక లాంటి హైదరాబాద్ అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. భారీ వర్షాలు పడితే నగర రోడ్లు చెరువులుగా మారుతున్నా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. మహిళలకు, గిరిజనులకు అన్యాయం చేసిందని అన్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని చెప్పి బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల అమలు గురించి ప్రస్తావించకపోవడం దారుణమన్నారు.

రచయిత్రి సి.మృణాళినికి సినారె సాహిత్య పురస్కారం

చిక్కడపల్లి: త్యాగరాయ గాన సభలో శుక్రవారం సాయంత్రం మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగరాగిణి నిర్వహణలో డాక్టర్ సినారె జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ హాజరై మట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.మృణాళికి సినారె సాహిత్య పురస్కారం అందజేసి సత్కరించారు. సాహిత్యంలో వివిధ ప్రక్రియలో మృణాళిని చేసిన రచనలు ఆలోచనాత్మకంగా ఉంటాయని ఆయన అన్నారు. సినారె సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్యరైల్వే విశ్రాంతి జీఎం సి.రామకృష్ణ, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, రమణకుమారి, సుబ్బలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'తెలుగు కళా మాలిక'

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో శుక్రవారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'తెలుగు కళా మాలిక'శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమైక్య రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెళ్ల భాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కళా ప్రదర్శనలను తిలకించారు. ఎంఎస్ రాయ్ వంటి మహనీయులు దేశకీర్తిని పెంచారన్నారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆయన సత్కరించారు. కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి, వీడీ రాజాగోపాల్, దైవజ్ఞశర్మ పాల్గొన్న సభకు ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ అధ్యక్షత వహించారు.

కారు జరపమన్నందుకు వ్యక్తిపై కాంగ్రెస్ నేత దాడి

అంబర్‌పేట: కారు పక్కకు తీయమన్నందుకు ఓ వ్యక్తిపై కాంగ్రెస్ నేత దాడి చేశాడు. ఈ సంఘటన గురువారం రాత్రి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక శంకర్‌నగర్‌లో నివాసించే శ్రీనివాస్ నాయీ తన కారు పార్క్ చేయడానికి స్థానిక కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌యాదవ్‌ను అతడి కారు కాస్త జరపమన్నాడు. ఈ క్రమంలో మాటామాట పెరిగడంతో కాంగ్రెస్ నేత శ్రీనివాస్ నాయీపై దాడి చేశాడు. దీంతో శ్రీనివాస్ నాయీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రేణుకాఎల్లమ్మ బోనాలు

ముస్తాబైన ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలోని ఆలయం





బోనాలకు ముస్తాబైన ఫీవర్ ఆస్పత్రి సమీపంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయంలో ఈనెల 28వ తేదీన బోనాల పండుగలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుతాడి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలో జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో ఆయన జాతర వివరాలు వెల్లడించారు. యంగ్ మెన్స్ అసోసియేషన్, లోకల్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. ఆలయ కమిటీ తరపున అమ్మవార్లకు తొలి బోనం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. సి.రోహిణ్‌రెడ్డిలతో పాటు ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, సలహాదారు చంద్రయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఈ-శ్రమ్ కార్డులకు పేర్లు నమోదు చేసుకోవాలి



కార్మికుల పేర్లు నమోదు చేయిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డులో పేర్లు నమోదు చేయించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం కాచిగూడ, ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ-శ్రమ్ కార్డుల పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆమే పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మహేశ్వరి, టీచర్ శోభ, సబిత, రమాదేవి, వరలక్ష్మీ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్

నల్లకుంట: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని నల్లకుంట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలు.. నల్లకుంట శంకరమఠం ఎదురు లేన్‌లోని కేజీఎస్ హోటల్ సమీపంలో నివాసముండే షేక్ మదార్ కుమారుడు షేక్ మోసిన్(20) ఏసీ మెకానిక్ (టెక్నీషియన్). ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11గంటల మధ్య అడిక్‌మెట్ జీహెచ్ఎంసీ గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. సీఐ జగదీశ్వర్‌రావు ఆదేశాలతో శుక్రవారం అక్కడే మాటు వేసిన పోలీసులు షేక్ మోసిన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్టు అంగీకరించాడు. అతని వద్ద నుంచి 6 గ్రాముల గంజాయి ప్యాకెట్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నింధితుడిని నాలుగో మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతడికి రిమాండ్ విధించారు.

బోనాలకు భక్తులు సన్నద్ధం..
అధికారుల సమీక్ష సమావేశం

• ఆలయాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన వివిధ శాఖల అధికారులు • వేడుకల్లో అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి



అమ్మవారికి బంగారు బోనం, పట్టుచీర సమర్పించేందుకు వెళ్తున్న కార్పొరేటర్ పావని

అంబర్‌పేట: బోనాల వేడుకలకు అన్ని ప్రభుత్వ విభాగాల అధికార యంత్రంగం సహకరించాలని ఇటీవల అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు వివిధ విభాగాల అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం అంబర్‌పేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో అధికారులు ఆలయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆది, సోమవారాల్లో జరిగే ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అధికారులు అన్ని ఆలయాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు వంటి మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. శాంతియుత వాతావరణంలో బోనాల ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ రఘు, డీఎంసీ మారుతీదివాకర్, ట్రాఫిక్ ఏసీపీ సంపత్, ఇన్‌స్పెక్టర్ అశోక్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు దుర్గప్రసాద్‌రెడ్డి, శంకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రంగంపల్లి రాజు, సుధాకర్, గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా అమ్మవారికి బంగారు బోనం

చిక్కడపల్లి: లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి శుక్రవారం కార్పొరేటర్ పావని బంగారు బోనం, మగ్గంపై నేసిన చేనేత పట్టు చీరను సమర్పించారు. అనంతరం ఆమె గాంధీనగర్‌లో మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో కలసిమెలసి జరుపుకోవాలన్నారు. అమ్మవారి దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వినయ్‌కుమార్, పూసరాజు, రాజేందర్‌యాదవ్, మారుతియాదవ్, అరవింద్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్ బస్తీలో బోనాల సంబరాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల సంబరాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో నాయకులు బి.గంగాధర్, బి.రవి, ఎంఎస్ శ్రీనివాసరావు, అరవింద్ కుమార్, హరినాథ్, గంగాధర్, ఆర్.వివేక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ముషీరాబాద్ మహంకాళి

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని మహంకాళి అమ్మవారిని శుక్రవారం శాకంబరి రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా బంగారు మైసమ్మ కల్యాణోత్సవం

ముషీరాబాద్: భోలక్‌పూర్ మహాత్మానగర్‌లో ప్రసిద్ధిగాంచిన బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన బంగారు మైసమ్మ కల్యాణ మహోత్సవానికి ముందు అమ్మవారికి బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా పోతరాజులు, శివసత్తుల నృత్యాలతో భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ పూజల్లో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్‌ముదిరాజ్, బీసీ కులసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కాటం నర్సింహయాదవ్, నాయకులు ఎల్లమ్మ, మాలతీ, నారాయణ, రవి, విజయ, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి



శ్రీరామ్‌నగర్ బస్తీలోని బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు